## మినీకథ

# షాక్



## యెరుబండి వెంకటేశ్వరరావు

పది రోజులుగా ఒకరంటే ఒకరికి పడటం లేదు. ఒకరి మీద ఒకరికి ద్వేషం పెరిగిపోయింది. తను జీవితం ఇలా అవుతుందని ఏనాడూ ఊహించలేదు రజని. రమేష్ ఈ మధ్య ప్రతీ దానికి తగాదా పెట్టుకుంటున్నాడు. ప్రేమించి పెళ్ళిచేసుకున్న రమేష్ ఇలా మారతాడని కలలో కూడా ఊహించలేదు. సంగతులన్నీ వివరిస్తూ అన్నయ్య కిరణ్‌కి ఉత్తరం వ్రాసింది.

కిరణ్. రమేష్ ఇద్దరూ కాలేజ్ మేట్స్. రమేష్‌కి రజని ఒక సంవత్సరం జూనియర్. కిరణ్ రజని అన్నాచెల్లెళ్ళులా కాక ఇంచుమించు స్నేహితులుగా ఉండేవారు. రజనీ. రమేష్‌ల ప్రేమవిషయం ముందుగానే పసిగట్టిన కిరణ్. వాళ్ళ పెళ్ళికి తల్లిదండ్రుల్ని ఒప్పించటంలో విఫలం కాలేదు. రజనీ రమేష్‌లు పెళ్ళయిన వెంటనే వేరే కాపురం పెట్టారు. చేసుకున్నది ఆదర్శ వివాహమయినా. రానురాను ఆర్థిక పరిస్థితి ఇరకాటంలో పడటంతో రజనిని కట్నం తెమ్మని పోరటం మొదలెట్టాడు రమేష్. గొడవ చినికి చినికి గాలివానగా మారి కిరణ్‌ని రమ్మని ఉత్తరం వ్రాసేలా చేసింది.

చెల్లి ఉత్తరం అందిన మర్నాడే కిరణ్ ఊరినుంచి దిగాడు. రమేష్ ముభావంగా ఉండడంతో పలకరించాలనిపించలేదు. రజని లోపలినుంచి అప్పుడేవస్తూ మాటా పలుకూ లేకుండా ఉన్న భర్తనీ. అన్ననీ చూస్తూ నిలబడిపోయింది. కాసేపటికి తనే తేరుకుని "ఎప్పుడొచ్చావన్నయ్యా" అంది. "ఇప్పుడే నమ్మా రావటం. ఏంటి మాటా పలుకూ లేకుండా ఉన్నాడు మీ ఆయన?" అన్నాడు కిరణ్. "ఓహో అంతా ఈవిడగారి నిర్వాకమన్నమాట! ఈయనగారు పెళ్ళయింతర్వాత చెల్లి ముఖం చూడ్లేదు. చెప్పా పెట్టకుండా ఊడిపడ్డాడేంటాని అనుకుంటున్నాను. ఉత్తరం వ్రాసి రప్పించావన్న మాట.

పోన్లే ఇప్పటికయినా గుర్తువచ్చినందుకు సంతోషం!" అన్నాడు రమేష్. ఆ మాటలు విన్న అన్నాచెల్లెళ్ళిద్దరూ విభ్రాంతులయ్యారు. "అవేం మాటలు బావా! మీ పెళ్ళయి రెణ్ణెల్లయినా కాలేదు. అమ్మానాన్నకి ఖాళీలేక. నాకూ ఆఫీస్ పనితో తీరికలేకరాలేకపోయాం. ఇప్పుడేమయింది?" "ఏమయిందా? మీ చెల్లెల్నే అడుగు."

"ఏం లేదన్నయ్యా! ఆయన ఆర్థిక పరిస్థితి బాగాలేనప్పుడల్లా నా మీద విరుచుకుపడతారు. నేనేదో కట్నం తేలేదట. మనం ఇవ్వగలిగి ఉండీ ఇవ్వలేదట. నన్ను వదిలించుకున్నారనీ ఏదేదో తిడుతుంటారు" అంది రజని.

"అవును నీకో షాకింగ్ న్యూస్ చెబుతాను విను. నేను తలుచుకుంటే నీ చెల్లి బ్రతుకు పెళ్ళికి ముందే బజారున పెట్టేవాడిని. కానీ అది నా ఆదర్శభావాలకు వ్యతిరేకం కాబట్టి, నీ చెల్లి. నేను పెళ్ళికి ముందే తొందరపడినా పెళ్ళినాటికి నెల తప్పిందని తెల్సినా పెళ్ళిచేసుకున్నాను. మీకామాత్రం కృతజ్ఞత లేకుండా నాకు మామూలుగా కట్టబెట్టి చేతులు దులుపుకుంటే సరిపోయిందనుకున్నారు" అన్నాడు రమేష్.

తనూహించిన షాక్ ఏమీ కిరణ్ ముఖంలో లేకపోగా, అతను మరింత నిశ్చలంగా తెగింపుగా మాట్లాడుతుంటే రమేష్ వింటూ ఉండిపోయాడు - "చూడు రమేష్ నువ్వేదో నాకు షాక్ ఇద్దామనీ, షాకింగ్ న్యూస్ చెప్పాననీ అనుకోకు. నువు దాన్ని పెళ్ళిచేసుకోకుండాఅలావదిలేశావనుకో, దాని బ్రతుకుతో ఆడుకున్న దుర్మార్గుల లిస్టులో నీవు మూడోవాడివవుతావు. ఎటొచ్చీ దానికి మూడోసారి ఎబార్షన్ చేయించటానికినాకో నాలుగువందలు ఖర్చు. దాని ఆరోగ్యం కొంచెం పాడూ అవుతాయి. అంతే!" అన్నాడు కిరణ్. దాంతో 'షాక్' తినటం రమేష్ వంతయింది.

●